క్లుప్తంగా

అర్హులకు ప్లాట్లు ఇవ్వాలి

వరంగల్: వరంగల్ లక్ష్మీపురంలోని మోడల్ కూరగాయల మార్కెట్‌లో కొంతమంది కమీషన్ పేరిట మడిగెలు (షట్టర్లు) పొందిన, అదనంగా ఓపెన్ ప్లాట్లు తీసుకున్న వారిని గుర్తించి వారిస్థానంలో అర్హులైన చిరు వ్యాపారులకు ప్లాట్లు కేటాయించాలని వరంగల్ జిల్లా హోల్‌సేల్ అండ్ రిటైల్ వెజిటేబుల్ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు బిట్ల కృష్ణ, ప్రధాన కార్యదర్శి సామల రాజులు కోరారు. ఏనుమాముల మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.నిర్మలకు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వ్యాపారులు మాట్లాడుతూ తోట సుధాకర్, చల్ల సదానందం, పల్లం రవికి కమీషన్ లైసెన్సులు, మడిగెలు ఇచ్చినప్పటికీ అదనంగా ఓపెన్ ప్లాట్లు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రేడ్ -2 సూపర్‌వైజర్ అంజిత్‌రావు, కమిటీ ఉపాధ్యక్షుడు సమిండ్ల సూరయ్య, సభ్యులు పాల్గొన్నారు.

వర్క్‌షాప్ బ్రోచర్ ఆవిష్కరణ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాలలో ఏఐసీటీఈ ఈట్రెనింగ్ అండ్ లెర్నింగ్ అకాడమీ సహకారంతో ఈనెల 27నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ఈమేరకు వర్క్‌షాప్ బ్రోచర్‌ను కేయూలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డితో కలిసి వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. అడ్వాన్స్‌మెంట్ ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్ ఫర్ మోడర్న్ ఇంజనీరింగ్ సొల్యూషన్స్ అనే అంశంపై ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జగన్‌మోహన్ రాజు తెలిపారు. వివరాలకు వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కాకతీయ.ఏసీ.ఇన్‌లో చూడవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం డీన్ ప్రొఫెసర్ సదానందం, కోఆర్డినేటర్ డాక్టర్ కిశోర్‌కుమార్, కేయూ ఇంజనీరింగ్ కళాశాలల ప్రిన్సిపాళ్లు డాక్టర్ రమణ, డాక్టర్ భిక్షాలు పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానం

హన్మకొండ: రక్తదానం మరొకరికి ప్రాణదానమని టీజీఎస్ ఆర్టీసీ వరంగల్ డిప్యూటీ రీజినల్ మేనేజర్లు మాధవ రావు, కేశరాజు భానుకిరణ్ అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా హనుమకొండలోని ఆర్టీసీ వరంగల్ రీజియన్ కార్యాలయంలో బుధవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ పాలక మండలి సభ్యుడు శ్రీనివాస్‌రావు, పుల్లూరి వేణు, డిపో మేనేజర్లు వంగల మోహన్ రావు, భూక్యా ధరంసింగ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో రక్తదాన శిబిరం

విద్యారణ్యపురి: హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల (కో ఎడ్యుకేషన్)లో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు ప్రారంభించి మాట్లాడారు. రక్తదానం.. మరొకరికి ప్రాణదానం అని అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రాజ్‌కుమార్, వలంటీర్లు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

17న పాటల పల్లకి

నయింనగర్: ఈనెల 17న హనుమకొండ పబ్లిక్ గార్డెన్ నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో 12 గంటల పాటల పల్లకి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఉద్యమ కవి, గాయకుడు నేర్యాల కిశోర్ తెలిపారు. గత ప్రభుత్వం తెలంగాణ ఉద్యమ కళాకారులను పట్టించుకోకుండా అన్యాయం చేసిందని, నిరుద్యోగ ఉద్యమ కళాకారులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈమేరకు పాటల పల్లకి పోస్టర్లను హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో టీపీసీసీ సాంస్కృతిక సేన రాష్ట్ర అధ్యక్షుడు చక్రాల రఘుతో కలిసి బుధవారం ఆవిష్కరించారు. అనంతరం రఘు మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కవులు, కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో గజవెల్లి ప్రతాప్, గడ్డం సుధాకర్, పాలాటి రాజు, మోతె రమేష్, క్రాంతికుమార్, బుల్లెట్ వెంకన్న పాల్గొన్నారు.

రెగ్యులరైజ్ చేయాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ డిమాండ్ చేశారు. యూనివర్సిటీలో యూనియన్ కార్యాలయంలో బాధ్యుడు రాంచందర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రమేష్ మాట్లాడారు. యూనివర్సిటీలో 25ఏళ్లుగా వివిధ విభాగాలు, కళాశాలు, హాస్టళ్లలో పనిచేస్తున్న ఆయా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని సూచించారు. సమావేశంలో తెలంగాణ యూనివర్సిటీస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మెట్టు రవి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిరంజీవి, ప్రధాన కార్యదర్శి రవికుమార్, బాధ్యులు పాల్గొన్నారు.

లైబ్రరీని వినియోగించుకోవాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని గ్రంథాలయ వనరులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కేయూ గ్రంథాలయ సభ్యుడు, ఇన్‌చార్జ్ సీజే.శ్రీలత కోరారు. విశ్వవిద్యాలయంలోని లైబ్రరీ సైన్స్ విభాగంలో ఫ్రెషర్స్ డే సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విభాగం అధిపతి డాక్టర్ రాధికారాణి మాట్లాడారు. వర్సిటీలోని గ్రంథాలయాన్ని వినియోగించుకొని పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని ఆమె సూచించారు.

ఆహ్లాదం.. ఆరోగ్యం.. ఆస్పత్రి సొంతం



పచ్చని చెట్లతో ఆహ్లాదంగా కనిపిస్తున్న ప్రభుత్వ ఆస్పత్రి



ఆస్పత్రి ఆవరణలో ఆకట్టుకుంటున్న మొక్కలు

- పచ్చదనంతో ఆకట్టుకుంటున్న ప్రభుత్వ ఆస్పత్రి
- తోటను తలపిస్తున్న ప్రాంగణం
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు

ఎల్కతుర్తి : ఆస్పత్రి అనగానే అయోడిన్, మందుల వాసన గుర్తుకొస్తుంది. అయితే ప్రభుత్వ ఆస్పత్రి అంటే చెప్పాల్సిన అవసరం లేదు. కానీ ఈ ఆస్పత్రిని చూస్తే మాత్రం వేరే ఫీలింగ్ కలుగుతుంది. ఈ ఆస్పత్రి ప్రాంగణంలో పర్యావరణం తొణికిసలాడుతోంది. ఆస్పత్రి చుట్టూ పచ్చని చెట్ల ఉండడంతో ఆకర్షణీయంగా కనిపిస్తోంది. ఇదంతా ఏదో కార్పొరేట్ ఆస్పత్రి కాదు. ఈ ఆకుపచ్చని అందమంతా ఓ ప్రభుత్వ ఆస్పత్రి సొంతం చేసుకుంది.

ఆహ్లాదమైన వాతావరణం

మండలంలోని గోపాల్‌పూర్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 2000 సంవత్సరంలో నిర్మించారు. అప్పటి నుంచి రోగులకు వివిధ రకాల సేవలను అందిస్తున్నారు. దూరం నుంచి చూస్తే రకరకాల చెట్లతో తోటను తలపిస్తోంది. ఆస్పత్రి లోనికి వెళ్తే పార్కులోకి వెళ్లిన అనుభూతి కలుగుతుంది. ఆస్పత్రి చుట్టూ పలు రకాల చెట్లు, మొక్కలతో ఆహ్లాదాన్ని పంచుతోంది. అనేక రకాల వ్యాధులతో వచ్చే రోగులు ఆస్పత్రి లోనికి రాగానే పచ్చదనాన్ని చూసి సగం రోగం మాయమయ్యే విధంగా ఉందని అభిప్రాయపడుతున్నారు. గార్డెనింగ్‌కు ఉపయోగించే మొక్కలు అందమైన ఆకృతిలో మలుచబడి ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటుంది.

ఎన్ని రకాల చెట్లంటే..

ఆస్పత్రిలో ప్రస్తుతం 36 మామిడి చెట్లు, 40 టేకు చెట్లు, 5 సపోట, 3 వేపతో పాటు నిమ్మ, జామ, వివిధ రకాల పూల మొక్కలు ఉన్నాయి. ప్రభుత్వ ఆస్పత్రిని అహ్లాదంగా తీర్చిదిద్దడంతో పాటు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నందున పలువురు స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు భద్రత.. అందరి బాధ్యత



పోలీస్ సిబ్బందితో కలిసి బైక్ ర్యాలీలో పాల్గొన్న డీసీపీ రవీందర్, ఆర్డీఓ నారాయణ

- ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్, ఆర్డీఓ నారాయణ

ఆత్మకూరు : వాహనదారులు రహదారి భద్రతా నియమాలు పాటించాలని వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ సూచించారు. బుధవారం మండల కేంద్రం నుంచి గుడెప్పాడ్ వరకు ఆత్మకూరు పోలీసుల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. జాతీయ రహదారి భద్రతా మాసాన్ని పురస్కరించుకుని ప్రజలకు రహదారి భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. వాహనదారులంతా డ్రైవింగ్ నియమాలను పాటించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దని, హెల్మెట్, సీట్‌బెల్ట్ విధిగా ధరించాలని అన్నారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు. అనంతరం ఆర్డీఓ నారాయణ మాట్లాడుతూ.. వాహనదారులు అతివేగంగా వాహనాలు నడిపి ప్రాణాలు కోల్పోవద్దని అన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతు డ్రైవింగ్ చేయొద్దని సూచించారు. ఈ సందర్భంగా వాహనదారులకు ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేశారు. తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డి, సీఐ సంతోశ్ పాల్గొన్నారు.

నర్సరీలపై ప్రత్యేక దృష్టి సారించాలి

- ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి

దామెర : గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న నర్సరీలపై ప్రత్యేక దృష్టిసారించాలని ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్చి 31 వరకు మండలంలో గుర్తించిన 111 పనులు పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో ప్రతి ఇంటి ఆవరణలో మరుగుదొడ్డి ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. నర్సరీల్లో నాణ్యమైన విత్తనాలను నాటేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ శారద, ఈసీ రాజేశ్, కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి

క్యాలెండర్ ఆవిష్కరణ



ఎల్కతుర్తి : తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ఉపాధ్యాయ సంఘం (టీపీటీఎఫ్) రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం ఆవరణలో ఎంఈఓ చదువుల సత్యనారాయణ బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు సారయ్య, ప్రధానకార్యదర్శి సదానందం పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో సంఘం ముందుండి పోరాడుతుందన్నారు. అదే విధంగా పీఆర్సీని వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. బకాయిలను, పెండింగ్ డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాధ్యులు కుమారస్వామి, హరికృష్ణ పాల్గొన్నారు.

వేలేరులో..



వేలేరు : మండల కేంద్రంలో తెలంగాణ ప్రోగెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంఈఓ చంద్రమౌళి బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం జ్ఞానేశ్వర్, ఆ సంఘం మండల అధ్యక్షుడు సదయ్య, ప్రధానకార్యదర్శి హరిలాల్, ఉపాధ్యాయులు వెంకటస్వామి, రమేశ్, అబ్దుల్ సత్తార్, సదానందం పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మాస్క్ ధరించాలి

- డాక్టర్ నరసింహారావు

ఆత్మకూరు : ప్రతిఒక్కరూ మాస్క్ ధరించారని డాక్టర్ నరసింహారావు సూచించారు. మండలంలోని అక్కంపేటలో గల ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో బుధవారం హెచ్ఎంపీవీ వైరస్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జలుబు, దగ్గు వచ్చినప్పుడు చేతులు అడ్డుపెట్టుకోవాలని, ఇతరులకు దూరంగా ఉండాలన్నారు. తుమ్మినప్పుడు కర్చీఫ్ అడ్డుపెట్టుకోవాలన్నారు. రోగ నిరోధక శక్తిని పెంచుకోవడానికి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది కందకట్ల సంపత్, వసంత, ప్రధానోపాధ్యాయుడు ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ నరసింహారావు

ఘనంగా హజ్రత్ సయ్యద్ మదార్ షావలి ఉర్సు

- పాల్గొన్న ఎంపీ కావ్య, ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

నడికూడ : మండలంలోని ముస్త్యాలపల్లిలో గల హజ్రత్ సయ్యద్ మదార్ షావలి దర్గా ఉర్సు బుధవారం ఘనంగా జరిగింది. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దేశంలోని ప్రజలు సుఖశాంతులతో ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. దర్గా అభివృద్ధికి అవసరమైన నిధులను మంజూరు చేస్తామని, వసతుల కల్పనకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎంపీ నిధులు రూ.6 లక్షలతో ముస్త్యాలపల్లి గ్రామంలో సీసీరోడ్డు పనులకు వారు శంకుస్థాపన చేశారు. అనంతరం రాయపర్తి గ్రామంలో పరకాల ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో దర్గా ముతవల్లి మహ్మద్ ఖాజఖాద్రి, మండల కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులతో పాటు అధిక సంఖ్యంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.



ప్రార్థనలు చేస్తున్న ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

రమేశ్ బిదూరి క్షమాపణ చెప్పాలి

- యూత్ కాంగ్రెస్ నాయకుల డిమాండ్
- ప్రధాని మోదీ, బిదూరి ఫ్లెక్సీ దహనానికి యత్నం, అడ్డుకున్న పోలీసులు

కమలాపూర్ : వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ మాజీ ఎంపీ రమేశ్ బిదూరిని వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని యూత్ కాంగ్రెస్ హుజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ధర్మల శ్రీకాంత్, మండల అధ్యక్షుడు దూడ శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కమలాపూర్‌లో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో హుజూరాబాద్–పరకాల ప్రధాన రహదారిపై నిరసన, ఆందోళన చేపట్టారు. ప్రధాని మోదీ, బీజేపీ మాజీ ఎంపీ రమేశ్ బిదూరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రియాంక గాంధీపై చేసిన అనుచిత వ్యాఖ్యలు వెంటనే ఉపసంహరించుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రధాని మోదీ, రమేశ్ బిదూరి ఫ్లెక్సీ దహనానికి యత్నించగా పోలీసులు అడ్డుకుని పలువురు యూత్ కాంగ్రెస్ నాయకులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై వారిని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపాక మనీష్‌గౌడ్, అసెంబ్లీ కార్యదర్శులు ఆడెపు శ్రీకాంత్, పైసా శరత్, మండల ఉపాధ్యక్షుడు చేరాల రోహిత్, నాయకులు తేజ, కుమార్, అనిల్, వెంకటేశ్, శ్రీనివాస్, నాగరాజ, మనోజ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

నియామకం



ఐనవోలు : మండల కేంద్రానికి చెందిన గడ్డం రఘువంశీ గౌడ్‌ను తెలంగాణ గౌడ సంఘం మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు శ్రీపతి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన మండల, జిల్లా నాయకులకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మార్కెట్ గోదాంలో బియ్యం నిల్వ చేయాలి

- ఎమ్మెల్యేకు ఏఐటీయూసీ నాయకుల వినతి

పరకాల : పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో 7500 మెట్రిక్ టన్నుల కెపాసిటీ కలిగిన గోదాంను రేషన్ బియ్యం నిల్వ చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఈ మేరకు ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లంకదాసరి అశోక్ ఆధ్వర్యంలో బుధవారం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి కలిసి వినతిపత్రం అందించారు. మార్కెట్ గోదాంలను రేషన్ బియ్యం నిల్వకు వినియోగించడం వలన 200 మంది హమాలీ కార్మికులకు ఉపాధి లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు జక్కు రాజు, భద్రయ్య, యాదగిరి, శంకర్, రవి, రాజు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

పాఠశాలలో స్వయంపాలన దినోత్సవం

ఐనవోలు : మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో బుధవారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. హెచ్‌ఎంగా అవినాథ్, ఎంఈఓగా రాజశేఖర్, డీఈఓగా స్నికిత, ఉపాధ్యాయులుగా వైష్ణవి, ఉమామహేశ్వరి, అన్విత, హర్షిత, ఆదిత్య, అవంతిక, అఖిల్, నిఖిత, వంశీ పాల్గొన్నారు. కాగా ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి పులి ఆనందం హాజరై మాట్లాడారు. ప్రాథమిక పాఠశాలలో స్వయంపాలన దినోత్సవం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాల వలన విద్యార్థులకు సామాజిక, వృత్తి, సాంస్కృతిక, బాధ్యతలు, విధులు తెలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటేశ్వర్ రావు, మహేందర్‌రెడ్డి, లక్ష్మి, విజయ, సారయ్య, సీఆర్‌పీలు రేవతి, రాజ్‌కుమార్, భవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



స్వయంపాలన దినోత్సవంలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఆరెంజ్ డే వేడుకల్లో ఆకట్టుకున్న చిన్నారులు

పరకాల : పట్టణంలోని బిట్స్ పాఠశాలలో ఆరెంజ్‌డే వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ యుగేందర్ ఆధ్వర్యంలో ప్రైమరీ విద్యార్థులు ఆరెంజ్ కలర్ డేను ఉత్సాహంగా జరుపుకొన్నారు. విద్యార్థులంతా ఆరెంజ్ దుస్తులు ధరించి ఆరెంజ్ కలర్ వస్తువులు, కూరగాయలు, పండ్లు తీసుకొచ్చి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. జ్ఞాన నైపుణ్యాలు, ఆలోచనలో మార్పు, సృజనాత్మకత, భాషాభివృద్ధిని పెంపొందిస్తూ రంగుల ప్రాముఖ్యతను అర్థం చేసుకునేందుకు ఈ ఆరెంజ్ కలర్‌డే ఉపయోకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమ, స్వప్న, రవళి, అనిత, సుమలత, సమీనా, స్వప్న పాల్గొన్నారు.



ఆరెంజ్ డే పాల్గొన్న బిట్స్ విద్యార్థులు

నేషనల్ సాఫ్ట్‌బాల్ పోటీలకు అయాన్ష్ ఎంపిక



దామెర : నేషనల్ సాఫ్ట్‌బాల్ పోటీలకు మండల కేంద్రానికి చెందిన టి.అయాన్ష్ ఎంపికయ్యాడు. పరకాల బాలుర కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి.. ఇటీవల మెదక్ జిల్లాలోని తూప్రాన్‌లో జరిగిన సౌత్ జోన్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చి ఈనెల 11 నుంచి 13 వరకు పాండిచ్చేరిలో జరిగే సీనియర్స్ సౌత్ జోన్ నేషనల్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ సమ్మయ్య, ఉపాధ్యాయ బృందం అయాన్ష్‌కు పుష్పగుచ్ఛం అందించి అభినందించింది. నేషనల్‌స్థాయిలో కూడా రాణించాలని వారు ఆకాంక్షించారు.

మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలి

- దళిత సంఘం మండల అధ్యక్షుడు సుధాకర్

శాయంపేట : మండల కేంద్రంలోని బస్‌షెల్టర్ ఆవరణలో గల మరుగుదొడ్లు చెత్తతో నిండి నిరుపయోగకరంగా మారాయని, వెంటనే చెత్తను తొలగించాలని దళిత సంఘం మండల అధ్యక్షుడు మారపల్లి సుధాకర్ కోరారు. బుధవారం మరుగుదొడ్లను పరిశీలించి మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి ప్రయాణికుల సౌకర్యార్థం బస్‌షెల్టర్‌ను నిర్మించారని గుర్తుచేశారు. ప్రస్తుతం మరుగుదొడ్లు చెత్తాచెదారంతో నిండిపోయాయని దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరుదొడ్లను శుభ్రం చేయించి వినియోగంలోకి తీసుకురావాలని కోరారు.



బస్టాండ్ ప్రాంగణంలోని మరుగుదొడ్లను పరిశీలిస్తున్న సుధాకర్

బ్రహ్మోత్సవాలపై పట్టింపేది : కొండేటి

ఐనవోలు : మల్లికార్జున స్వామి జాతర బ్రహ్మోత్సవాలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ ఆరోపించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జాతర సమీపిస్తున్నా ఏర్పాట్లు అసంతృప్తిగా ఉన్నాయని అన్నారు. గతంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న నెల రోజుల ముందుగా సమీక్షలు జరిపి జాతరను విజయవంతం చేసేవారని అన్నారు. జిల్లాకు చెందిన ఎండోమెంట్‌శాఖ మంత్రి కొండా సురేఖ దృష్టి సారించి భక్తులకు అన్ని వసతులు కల్పించాలని అన్నారు. అంతకుముందు ఆలయ పరిసర ప్రాంతాల్లో ఏర్పాట్లను పరిశీలించిన బీజేపీ నాయకులు.. ఆలయ తూర్పు ద్వారం వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేస్తున్న క్రమంలో ఆలయ ఆవరణలో మీడియా సమావేశం ఏర్పాటు చేయకూడదని ఎస్సై అడ్డుకోగా వారి మధ్య వాగ్వివాదం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు అడ్డగట్ల రాజేంద్రప్రసాద్, నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముత్తిరెడ్డి కేశవరెడ్డి, జిల్లా కార్యదర్శి, కోశాధికారులు గుండెకారి కోటేశ్వర్‌రావు, బొల్లెపెల్లి మహేశ్, మండల నాయకులు ప్రణయ్, పాక కుమారస్వామి, ప్రభాకర్, కుమార్, వెంకటనారయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీధర్

జర్నలిస్ట్ కుటుంబానికి సీఐ పరామర్శ

శాయంపేట : మండల కేంద్రానికి చెందిన జర్నలిస్ట్ బాల్నె తిలక్‌బాబు ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న సీఐ రంజిత్ రావు బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తిలక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట ఎస్సై జక్కుల పరమేశ్, ఏఎస్సై కుమారస్వామి, ట్రైనీ ఎస్సై, సిబ్బంది ఉన్నారు.

అయ్యప్ప ఆలయంలో ఇరుముడి ధారణ

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రం ఆవరణలోని అయ్యప్పస్వామికి గురుస్వాముల శరణుఘోషల మధ్య బుధవారం గోక్షీరాభిషేకం నిర్వహించారు. దేవాలయ వ్యవస్థాపక అధ్యక్షుడు ఐనవోలు వెంకటేశ్వర్లు శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి మహార్చన జరిపించి ప్రత్యేకంగా అలంకరించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



వరంగల్ క్రైం: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనరేట్ సైబర్ క్రైం ఏసీపీ విజయ్‌కుమార్ సూచించారు. నగరంలోని హంటర్‌రోడ్డులోని సాంఘిక సంక్షేమ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాలపై నిత్యం అప్రమత్తంగా ఉండాలని, ఎవరికీ కూడా వ్యక్తిగత సమాచారం ఇవ్వొద్దని అన్నారు. ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్టు పేరుతో మోసాలకు పాల్పడుతున్నారని, పోలీసులు ఎప్పుడూ డిజిటల్ అరెస్టులు చేయరని వివరించారు. సైబర్ మోసానికి గురైనట్లు గ్రహిస్తే తక్షణమే 1930 నంబర్‌కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ అర్బన్:
9951602875 9553955722
9010299096
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎల్. రాకేష్ వర్మ (S.R) : 9885438059 (హన్మకొండ)
వి. రాజ్‌కుమార్ యాదవ్ (S.R) : 9966290903 (ఎల్కతుర్తి)
ఎం. మధు (S.R) : 8639566261 (పరకాల)
కె. సుధాకర్ రెడ్డి (A.C.O) : 9177258410 (హన్మకొండ)